క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని ప్రచారం

నకిరేకల్ : విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరుతూ నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఆదివారం నకిరేకల్ పట్టణంలో ప్రచారం నిర్వహించారు. డిగ్రీలో చేరడానికి దోస్త్ స్పెషల్ ఫేజ్‌లో ఈ నెలాఖరు వరకు అవకాశం ఉందని కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య తెలిపారు. ఇంటర్ పాసైనవారు ఈ కార్యక్రమంలో దోస్త్ కోఆర్డినేటర్ గంజి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ నాగు, కళాశాల అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాసాచారి, మధుసూదన్‌రెడ్డి, శంకర్, శివశంకర్, నర్సింహాచారి, శ్రీను, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడికి నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

నకిరేకల్ : మండలంలోని తాటికల్ గ్రామ మాజీ సర్పంచ్, సీపీఎం సీనియర్ నేత మండల చంద్రయ్య వర్ధంతిని ఆదివారం జరుపుకున్నారు. వివిధ పార్టీల నాయకులు చంద్రయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చనగాని సుధాకర్, మాజీ ఎంపీటీసీ మిర్యాల చంద్రశేఖర్, పోలగోని వెంకటేశ్, బంటు రవి, దుర్గారావు, పిట్టల రాజు, మన్నెం లక్ష్మయ్య, చనగాని రాంబాబు, భాస్కర్, తిరుమలేష్, సిరికొండ మురళి, మండల కాటమయ్య, మండల కృష్ణ, కొత్వాల్ కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నాంపల్లి: మండల పరిధిలోని స్వాములవారి లింగోటం గ్రామానికి చెందిన తవిటి పెద్దలక్ష్మమ్మ ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న నాంపల్లి మండల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు ఏడుదొడ్ల రవీందర్ రెడ్డి లింగోటంకు వెళ్లి పెద్దలక్ష్మమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఆవుల వెంకటయ్య, మరగోని యాదయ్య, గడ్డి పుల్లయ్య, తవిటి సైదయ్య, కొమ్ము రామస్వామి పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం

కనగల్: నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్‌రెడ్డిని కనగల్ బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కలిసి బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, జొన్నలగడ్డ శేఖర్‌రెడ్డి, సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చండూరు : ప్రజలు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు పందుల సత్యం గౌడ్ అన్నారు. లకినేనిగూడెంలో డ్రెయినేజీ, మంచినీటి ట్యాంకుల వద్ద మురుగు నీరు చేరి దుర్వాసన, దోమలు వ్యాపిస్తున్న కారణంగా బీజేపీ కార్యకర్తలతో కలిసి శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అనంతరం సత్యంగౌడ్ మాట్లాడుతూ అధికారులు మున్సిపాలిటీ ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు, ప్రధానకార్యదర్శి స్వామి, కిసాన్ మోర్చా నాయకులు సామ వెంకట్‌రెడ్డి, కారింగు శంకరయ్య, రాజు, సత్తయ్య, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు గోవులు పట్టివేత

నల్లగొండ : అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని మర్రిగూడ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్ఐ ఎం.కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మర్రిగూడ మండలంలోని కొండూరు సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా బొలెరో వాహనంలో నాలుగు గోవులను మల్లేపల్లి సంతలో కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని కబేలాలకు తరలిస్తుండగా వాహనాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, గోవులను గోశాలకు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బంగారం, నగదు చోరీ

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి సమీపంలోని చెర్వుగట్టులో ఆదివారం ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దొడ్డి శంకరయ్య, యాదమ్మలు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఆదివారం పనికి వెళ్లి ఇంటికి వచ్చేసరికి వారి ఇంటి తాళాలు తీసి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగులగొట్టి, సామన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో పరిశీలించగా తులం బంగారం, రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సక్రమంగా అందని పౌర సేవలు!

- గట్టుప్పల్‌లో ఈ-పంచాయతీ ఆపరేటర్ పోస్టు ఖాళీ
- సర్టిఫికెట్ల కోసం జనం తిప్పలు
- పాత మండలాలకే వెళ్తున్న దరఖాస్తుదారులు


గట్టుప్పల్ ఎంపీడీఓ కార్యాలయం

గట్టుప్పల్ : మండల పరిషత్‌కు.. గ్రామ పంచాయతీలకు కీలకమైన ఈ-పంచాయతీ ఆపరేటర్ పోస్టు సుమారు 9 నెలలుగా ఖాళీగా ఉండడంతో మండల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గట్టుప్పల్ మండలం ఏర్పాటై మూడున్నర సంవత్సరాలకు మండల పరిషత్‌కు గెజిట్ లభించడంతో తమ సమస్యలు ఇక్కడే పరిష్కారం అవుతాయి అనుకున్న ఈ ప్రాంత ప్రజల ఆశలు అడియాశలుగానే మిగిలిపోయాయి. మరణ ధృవీకరణ, ఇతర పత్రాలకు ప్రజలు పాత మండలాలకు వెళ్లక తప్పడం లేదు.

నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు..

చండూరు మండలం నుంచి తేరట్‌పల్లి, శేరిగూడెం, ఖమ్మగూడెం, మర్రిగూడ మండలం నుంచి నామాపురం, అంతంపేట, సోమరాజుగూడెం, మునుగోడు మండలం నుంచి వెల్మకన్నె గ్రామాలను కలిపి గట్టుప్పల్ మండలాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గట్టుప్పల్ మండలంలో 15 వేల పైచిలుకు ఓటర్లుగా ఉన్నారు. ఇదే చండూరు మండల పరిషత్ కార్యాలయంలో 19 గ్రామ పంచాయతీలకు ముగ్గురు ఈ పంచాయతీ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. 7 రెవెన్యూ గ్రామాలతో మండలంగా కొనసాగుతున్న గట్టుప్పల్ మండల పరిషత్‌కు ఒక ఈ-పంచాయతీ ఆపరేటర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

9 నెలలుగా...

గట్టుప్పల్ మండల పరిషత్‌గా గెజిట్ లభించి సుమారు 9 నెలలు కావొస్తున్నా కీలకమైన ఈ-పంచాయతీ ఆపరేటర్ పోస్ట్ ఖాళీగా ఉంది. దీంతో ప్రజల దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు. అత్యవసర దరఖాస్తులను మాత్రమే ఎంపీడీఓ చొరవతో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ద్వారా పరిష్కరిస్తున్నారు. ఇంటి పన్నులు, నూతన ఇళ్ల నిర్మాణలకు అనుమతులు, ప్రజాపాలన దరఖాస్తుల పరిష్కారం, ఇళ్ల మార్పిడి, 15వ ఆర్థిక సంఘం నిధుల బదిలీ, కార్మికుల వేతనాలు, వెంచర్స్ లే అవుట్, గ్రామ పంచాయతీల లావాదేవీలు, ఓటర్ జాబితా తయారు తదితర పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి.

15 రోజులు తిప్పించుకున్నారు



మా నాన్న మరణ ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకుంటే ఈ పంచాయతీ ఆపరేటర్ లేదని 15 రోజులు కార్యాలయం చుట్టూ తిప్పించుకున్నారు. ఆఖరికి ఎంపీడీఓ చొరవ తీసుకుని జూనియర్ అసిస్టెంట్ ద్వారా పని చేయించి ధృవీకరణ పత్రం అందించారు.

– పేరువాల వంశీ, తేరట్‌పల్లి

అధికారుల దృష్టికి తీసుకుపోయా



గట్టుప్పల్ మండల పరిషత్ కార్యాలయానికి ఈ-పంచాయతీ ఆపరేటర్‌ను నియమించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయా. ఆపరేటర్ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కార్యాలయంలో పనిచేసే ఇతర సిబ్బందికి ఈ-పంచాయతీపై పూర్తిస్థాయిలో అవగాహన లేదు.

– మాధవరెడ్డి, ఎంపీడీఓ

బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి


రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

తిప్పర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు అన్నారు. ఆదివారం బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ ఎస్‌కే బాబాతో కలిసి తిప్పర్తి మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్వహించిన కార్యశాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో తిప్పర్తి మండలంలోని అన్ని స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీలో ఉంటారని తెలిపారు.

బీజేపీ నాయకుల రాస్తారోకో

తిప్పర్తి మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి మైక్, సౌండ్ బాక్స్‌లను ఏర్పాటు చేయగా.. వాటికి అనుమతి లేదంటూ పోలీసులు సౌండ్ బాక్స్‌లను తీసుకెళ్లారు. దీంతో తిప్పర్తి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పిల్లి రామరాజు మాట్లాడుతూ పోలీసులు అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వంగూరి రవి, నాయకులు పల్లె ప్రకాశ్, గంగాధర్, మహేష్, యాదగిరి, బ్రహ్మచారి, వడ్డే శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, ఎల్లంల శ్రీనివాస్‌రెడ్డి, శివశంకర్, సతీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


చండూరులో మాట్లాడుతున్న మల్లం మహేష్

చండూరు : యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ కోరారు. ఆదివారం యువ చైతన్య సైకిల్ యాత్ర చండూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్‌లను ప్రభుత్వం అరికట్టాలన్నారు. ఇలాంటివి ప్రోత్సహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ ఉపాధ్యక్షుడు పుల్లెంల శ్రీకర్, సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి, వడ్డగాని మహేష్, నరేష్, రాజేష్, చంద్రశేఖర్, సాయి తేజ, గోపి, వెంకన్న పాల్గొన్నారు.

గట్టుప్పల్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ అన్నారు. ఆదివారం యువ చైతన్య సైకిల్ యాత్ర గట్టుప్పల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి లింగస్వామి, మహేష్, నరేష్, రాజేష్, చంద్రశేఖర్, సాయి తేజ, రాజేష్, గోపి, వెంకన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శాలిగౌరారం: నిలిపి ఉంచిన కారును మరో కారు ఢీ కొట్టడంతో ఒకరికి గాయాలైన సంఘటన శాలిగౌరారం మండలంలో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలు.. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన దంత వైద్యుడు కొరిపల్లి గిరీష్ తన మామతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళుతూ శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం సమీపంలో జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంచిన కట్టంగూరు మండలం కురుమర్తి గ్రామానికి చెందిన చెన్నబోయిన శ్రీకాంత్ కారును ఢీ కొట్టి పంటపొలాల్లోకి దూసుకెళ్లాడు. కారులో ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో గిరీష్ గాయాల నుంచి బయటపడగా అతడి మామకు స్వల్ప గాయాలు కావడంతో నకిరేకల్‌లోని హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాద సమయంలో నిలిపి ఉన్న కారులో ఎవ్వరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

శ్రావణమాసం తొలి బోనం వేడుకలు


నల్లగొండ పట్టణంలో ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ తల్లి


ముత్యాలమ్మ తల్లి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

నల్లగొండ : పట్టణంలోని రామగిరిలో గల ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం మొదటి శ్రావణమాసం సందర్భంగా అర్చకులు గణపతి పూజ, పుణ్యహావాచనం, నవ కలశారాధన, అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు, చీరలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి ఎలిజాల అంజయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, నాగరాజు, మునాస వెంకన్న, మణిదీప్, కృష్ణయ్య, రాము, వినయ్‌కుమార్, ప్రసన్న, చంద్రకళ, సుమతమ్మ, పవన్, మహి, కీర్తి, మానస, మణికుమార్ పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రావణమాసం తొలి బోనాలను సమర్పించారు. ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈఓ అంబటి నాగిరెడ్డి బోనాల ఊరేగింపును ప్రారంభించారు. కార్యక్రమంలో కుమ్మర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడి జయంత్ రావు, రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏడుకొండల వెంకటేశం, బోనాల కమిటీ చైర్మన్ ఏడుకొండల సత్యవతి, వైస్ చైర్మన్ రాధారపు భిక్షపతి, గంగాధర వెంకటేశ్వర్లు, నీలకంఠం యాదగిరి, నీలకంఠం మంజుల నరేందర్, ఎన్.శేఖర్, ఎస్.కిషన్, ఎన్.భిక్షం, ఎన్ చంద్రశేఖర్, సత్తయ్య, జగ్గయ్య, మారయ్య పాల్గొన్నారు.


కనగల్ : దర్వేశిపురంలో బోనమెత్తిన మహిళలు

రెవెన్యూ సేవలు అందక ప్రజల అవస్థలు!


మునుగోడు తహసీల్దార్ కార్యాలయం

మునుగోడు: రెవెన్యూ సేవలు సకాలంలో అందక మునుగోడు మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మునుగోడు తహసీల్దార్ కార్యాలయంలో ఒక్కరే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉండడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. మండల వ్యాప్తంగా ఉన్న 28 గ్రామ పంచాయతీల్లో దాదాపు 50వేలకు పైగా జనాభా, 21 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మొత్తం 51,694 ఎకరాల భూ విస్తీర్ణం ఉంది.

మూడేళ్లుగా ఇదే పరిస్థితి..

మునుగోడు మండలంలో గతంలో ఇద్దరు ఆర్.ఐలు ఉండేవారు. మూడేళ్ల క్రితం వరకు ఇద్దరు ఆర్.ఐలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సేవలు అందించేవారు. అయితే మూడేళ్లుగా ఒక ఆర్.ఐ కలెక్టర్ కార్యాలయంలో భూసేకరణ విభాగంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తుండడంతో మిగిలిన ఒక ఆర్.ఐకి పనిభారం అధికమై మండల ప్రజలకు సరైన సమయంలో సేవలు అందించలేకపోతున్నారు. ప్రధానంగా కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నవారితోపాటు కల్యాణలక్ష్మి పథకం పొందేందుకు రోజుల తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకుని డిప్యూటేషన్‌పై జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఆర్.ఐని మునుగోడు తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మోదీ, అమిత్‌షాకు పట్టు వస్త్రాలంకరణ


ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు


అభివాదం చేస్తున్న నరేంద్రమోదీ, అమిత్‌షా

నల్లగొండ పట్టణానికి చెందిన మద్ది ప్రసాద్–లక్ష్మీప్రసన్న దంపతుల కుమారులు నరేంద్రమోదీ, అమిత్‌షాకు ఆదివారం దేవరకొండ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం నిర్వహించారు. వారి ఫ్లెక్సీలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. వారిని బీజేపీ నాయకులు నాగం వర్షిత్‌రెడ్డి, బండారు ప్రసాద్ ఆశీర్వదించారు. ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షాపై అభిమానంతో తమ కుమారులకు వారి పేర్లు పెట్టామని తల్లిదండ్రులు తెలిపారు. పెద్ద కుమారుడికి 11 ఏళ్లు, చిన్న కుమారుడికి ఏడేళ్లు ఉండడం గమనార్హం.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

నల్లగొండ టౌన్: రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలోని డాక్టర్స్ కాలనీలో జరిగిన పట్టణ రైతు సంఘం మహాసభలో ఆయన మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా ఊట్కూరు మధుసూదన్‌రెడ్డి, కుంభం కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా పిన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా నకిరేకంటి జానయ్య, కోశాధికారిగా బోదనపు వెంకటరెడ్డి, కమిటీ సభ్యులుగా బట్టు నిర్మల, సత్తయ్య, రామకృష్ణారెడ్డి, విష్ణుమూర్తి, పాక మల్లయ్య, బుచ్చిరెడ్డి, చెరుపల్లి విజయలు ఎన్నికయ్యారు. మహాసభకు ముందుగా లెక్కల రామచంద్రారెడ్డి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ ఆసం, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, కుంభం లక్ష్మమ్మ, ప్రసన్న, సరిత, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రసంగాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని వీటీ కాలనీ 108వ బూత్ వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ నాయకులు తిలకించారు. ప్రతి ఆదివారం ఉదయం దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాన్ని నల్లగొండలో బీజేపీ నాయకులు బూత్ కార్యకర్తలతో వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా. నాగం వర్షిత్‌రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, మాజీ కౌన్సిలర్ బొజ్జ నాగరాజు, మిరియాల సత్యనారాయణ, గుర్రం వెంకన్న, రఘుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కండేశ్వర స్వామి ఆలయంలో పూజలు

నకిరేకల్ : పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలోని తాటికల్ రోడ్డులో నిర్మిస్తున్న శ్రీ మార్కండేశ్వర స్వామి ఆలయ ప్రాంగణాలకు పూజా వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వేర్వేరుగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు మూడుదుడ్ల కృష్ణమూర్తి, కార్యదర్శి బోనగిరి యాదగిరి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పెండెం సదానందం, చేనేత సంఘం అధ్యక్షుడు చిలుకూరి లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు


అనితను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. నకిరేకల్ మండలం చందుపట్ల ప్రాథమిక పాఠశాల (బాలికల) హెచ్ఎం కడారి అనిత పదవీ విరమణ సభను నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జగదీశ్‌రెడ్డి పాల్గొని అనితను సన్మానించి మాట్లాడారు. అదేవిధంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వేర్వేరుగా పాల్గొని అనితను ఘనంగా సత్కరించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వంటల ఆనంద్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, నలగాటి ప్రసన్నరాజ్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కాళం నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల భవన నిర్మాణానికి కృషి


మాట్లాడుతున్న గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవన నిర్మాణానికి నల్లగొండలో స్థలం కేటాయించేందుకు కృషి చేస్తామని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన సంఘం ద్వితీయ వార్షికోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల బాటలోకి వచ్చిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విశ్రాంత ఉద్యోగులు బలపరచాలని కోరారు. యూనియన్ రాష్ట్ర నాయకుడు బుచ్చిరెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తుల యాదయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుకున్న పాఠశాలపై మమకారంతో..

- రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు
- అదే స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం
- ఆదర్శంగా నిలుస్తున్న ముసుకు కవిత


నోముల జెడ్పీ హైస్కూల్‌లో నిర్మాణంలో ఉన్న ఆడిటోరియం, తరగతి గదులు

నకిరేకల్ : తాను పుట్టిన ఊరు.. చదువుకున్న పాఠశాలపై మమకారంతో అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ తనవంతుగా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు ముసుకు కవిత. నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన ముసుకు కృష్ణారెడ్డి–లక్ష్మీ దంపతుల కూతురు కవిత ఒకటి నుంచి పదో తరగతి వరకు గ్రామంలోని ప్రాథమిక, జెడ్పీ హైస్కూల్‌లో చదివారు. కవిత భర్త శేఖర్‌రెడ్డి కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. తండ్రి కృష్ణారెడ్డి జిల్లా పరిషత్ విద్యాధికారిగా పనిచేసి రిటైర్డు అయ్యారు. కవిత 1985లో ఎస్జీటీ ఉద్యోగం సాధించారు. 2005లో స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ ఉపాధ్యాయురాలిగా పదోన్నతి పొంది జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పనిచూస్తూ 2018లో జరిగిన బదిలీల్లో తాను చదువుకున్న నకిరేకల్ మండలం నోముల జెడ్పీ హైస్కూల్లో జాయిన్ అయ్యారు.

పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో..

పాఠశాలలో జాయిన్ అయిన దగ్గర నుంచి దాతలు, పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. తన సొంత నిధులతోపాటు దాతల సహకారంతో రూ.15 లక్షలు సమీకరించి తరగతి గది, ఆడిటోరియం నిర్మిస్తున్నారు. దీంతోపాటు ప్రతి ఏటా ఆగస్టు 15, జనవరి 26న నిర్వహించే స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బహుమతులు, పారితోషికాలు అందజేస్తున్నారు. పాఠశాలకు 20 డెస్క్ బెంచీలు, బీరువా, విద్యార్థులు స్టడీ అవర్స్‌లో కూర్చునేందుకు పార్క్‌లో నాలుగు సిమెంట్ బెంచీలు సమకూర్చారు.

దాతలు సహకారం అందిస్తున్నారు



నేను పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేయడం ఎంతో సంతోషంగా ఉంది. నా సొంతంగా రూ.3 లక్షలు, నాతోపాటు చదువుకున్న పూర్వ విద్యార్థులు, మా కుటుంబీకుల నుంచి మరో రూ.12 లక్షల విరాళాలను సమీకరించా. మొత్తం రూ.15 లక్షలతో పాఠశాలలో ఆడిటోరియం, తరగతి గదులను నిర్మిస్తున్నాం. పూర్వ విద్యార్థులు, దాతలు కూడా సహకారం అందిస్తున్నారు.

– ముసుకు కవిత, ఉపాధ్యాయురాలు, నోముల జెడ్పీ హైస్కూల్

సమయానికి బస్సులు లేక విద్యార్థుల తంటాలు

మునుగోడు: తమ గ్రామంలో ఉన్నత పాఠశాల లేకపోవడంతో చొల్లేడు గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు మునుగోడులోని హైస్కూల్‌లో ఉన్నత విద్యనభ్యసించేందుకు వస్తున్నారు. పాఠశాల సమయంలో ఆర్టీసీ బస్సు లేకపోవడంతో ఆ గ్రామంలోని విద్యార్థులంతా ప్రత్యేకంగా ఆటోలో రోజూ మునుగోడులోని పాఠశాలకు వచ్చి వెళ్తున్నారు. ఆటోలో విద్యార్థులు నిండిపోవడంతో కొందరు విద్యార్థులు వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి పాఠశాలల సమయానికి అనుకూలంగా బస్సులు నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


వర్షంలో తడుస్తూ మునుగోడు పాఠశాలకు వెళ్తున్న చొల్లేడు విద్యార్థులు (ఫైల్)